సాక్షి శ్రీకాకుళం

శనివారం । 10 । ఆగస్టు । 2024



జీ(వి)తమింతేనా..

కాంట్రాక్టు, గెస్టు లెక్చరర్లు జీతం కోసం ఎదురు చూస్తున్నారు. రెగ్యులర్ చేస్తారని నిరీక్షిస్తున్నారు.

- 8లో



100 ఫోన్ల రికవరీ

పోలీసులు వంద ఫోన్లను రికవరీ చేశారు. వాటిని యజమానులకు అప్పగించారు.

- 8లో

12వ తేదీతో ముగియనున్న వెబ్ ఆప్షన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పీజీసెట్-2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 12వ తేదీ ఆప్షన్లకు చివరి తేదీ. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అఫిలియేషన్ కళాశాలల్లో పీజీ ప్రవేశాలు ఏపీ పీజీ సెట్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తారు.

న్యూస్‌రీల్

డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని 2016–2019 మధ్య చదివిన ఓల్డ్ రెగ్యులేషన్ డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలను జ్ఞానభూమి వెబ్‌పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. రెండో సెమిస్టర్ 1117 మంది పరీక్ష రాయగా, 545మంది ఉత్తీర్ణత సాధించారు. 48.79 శాతం ఉత్తీర్ణత నమోదైంది. నాలుగో సెమిస్టర్‌లో 1994 మంది పరీక్షకు హాజరు కాగా 923 ఉత్తీర్ణత సాధించారు. 46.29 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రీవాల్యుయేషన్ అవసరమైన వారు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

'వక్ఫ్ ఆస్తుల ఆక్రమణే కూటమి లక్ష్యం'



రఫీ



సిరాజుద్దీన్



షేక్ బాబ్జీ

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉన్న వక్ఫ్ ఆస్తులు చాలా విలువైనవి కావడంతో వాటిని ఆక్రమించేందుకే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెడుతున్నారని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి రఫీ తెలిపారు. ముస్లింల మనోభావాలను అర్థం చేసుకుని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించి మరోసారి మైనారిటీలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని తెలిపారు. టీడీపీ మాత్రం మోసం చేసిందన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతోచొరవ చూపించిందని, కానీ మైనార్టీల పక్షపాతినంటూనే చంద్రబాబు కూటమి మోసగిస్తోందని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు సిరాజుద్దీన్ అన్నారు. ఈ విషయాన్ని ముస్లింలంతా గమనించాలన్నారు.

'వక్ఫ్ బోర్డు బిల్లుకు టీడీపీ మద్దతు సరికాదు'

నరసన్నపేట: పార్లమెంట్ లో వక్ఫ్ బోర్డు బిల్లు ప్రవేశ పెట్టడం సరైంది కాదని, దీనికి టీడీపీ మద్దతు ఇవ్వడం శోచనీయమని జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు, నరసన్నపేట జామియా మసీదు ప్రతినిధి షేక్ బాబ్జీ అన్నారు. మొదటి నుంచీ మైనారిటీల పట్ల వ్యతిరేకంగా ఉన్న టీడీపీ ఇప్పుడు తన నైజాన్ని ఈ విధంగా బయట పెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లుతో మైనార్టీలకు అన్యాయం జరుగుతుందని, తమ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యే ప్రమా దం ఉందని ఆయన అన్నారు. ఇదే తరుణంలో వైఎస్సార్ సీపీ ఎంపీలు బిల్లుకు పార్లమెంట్‌లో వ్యతిరేకించడాన్ని స్వాగతించారు.

కేజీబీవీ తనిఖీ

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని టెక్కలి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు, ఆహారం వంటి వాటిపై పరిశీలన చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ఎస్ఎంసీ ఎన్నికలు జరగని బడులకు నోటిఫికేషన్ విడుదల

శ్రీకాకుళం న్యూకాలనీ: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు జరగని బడుల్లో తదుపరి ఎన్నికల షెడ్యూల్‌ను సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల 10వ తేదీతో మొదలయ్యే ఈ ఎన్నికల ప్రక్రియ 17వ తేదీలోగా పూర్తిచేయాలని పేర్కొంటూ నిర్దేశిత షెడ్యూల్‌ను విడుదల చేశారు.



జలుమూరు : పెద్దదూగాంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

● శ్రావణ శోభ

జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శోభ కనిపించింది. అన్ని చోట్లా వరలక్ష్మి వ్రతాలు వైభవంగా జరిగాయి. శ్రీముఖలింగంలోని ఆలయంలో వ్రతాలు నిర్వహించారు. అక్కడ వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– జలుమూరు, శ్రీకాకుళం కల్చరల్



పూజలు అందుకుంటున్న వారాహి అమ్మవారు



శ్రీకాకుళంలో ధాన్యలక్ష్మిగా విజయదుర్గ

ఐదేళ్లుగా వేలాది మంది గిరిజనులు కొండ దిగకుండానే రేషన్ అందుకున్నారు. ఇన్నాళ్లుగా ప్రతి పేదవాడు తన ఇంటి వద్దనే సగౌరవంగా సరుకులు తీసుకున్నాడు. కానీ కూటమి ప్రభుత్వం పేదోడిపై కక్ష కట్టినట్టు ఉంది. ఐదేళ్లుగా ప్రతి నెలా వారికి ఠంచనుగా రేషన్ అందిస్తున్న ఎండీయూ వాహనాలను ఆపేయడానికి కుట్ర పన్నుతోంది. ఆపరేటర్లు, టెక్నికల్ సిబ్బంది భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తూ.. సామాన్యుడిని మళ్లీ రేషన్ దుకాణాల ముందు క్యూలో నిలబెట్టనుంది.

జగనన్న బియ్యం బండి..
చంద్రన్న బ్రేకులండీ..

ఇలాంటి కష్టాలు తప్పవా..

- బియ్యం బండ్లు వద్దంటూ కొత్త ప్రభుత్వం నిర్ణయం
- రేషన్ పంపిణీకి ఇక తప్పని ఇబ్బంది
- బండి రాకుంటే మళ్లీ డీలర్ల వద్ద పడిగాపులు కాయాల్సిందే
- గిరి ప్రాంతాల్లో పాత వెతలు ఆరంభం
- ఆపరేటర్లు, టెక్నికల్ సిబ్బంది భవిత ప్రశ్నార్థకం



శ్రీకాకుళం పాతబస్టాండ్ / ఎల్ఎన్ పేట:

రేషన్ బండిని కూటమి ప్రభుత్వం కావాలనే ఆపేస్తోంది. నేరుగా ఇంటి వద్దకు వచ్చి, కచ్చితంగా తూకం వేసి పేదోడికి ఏమాత్రం కష్టం లేకుండా బియ్యం, సరుకులు అందిస్తున్న వ్యవస్థను రాజకీయ కోణంలో చూస్తూ ధ్వంసం చేయడానికి పథక రచన చేస్తోంది. ఈ నిలుపుదలకు ఇటీవల కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం సూచన చేసింది. దీంతో ఐదేళ్లుగా పేదోడితో పెనవేసుకుపోయిన రేషన్ బండి బంధం తెగిపోనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత రోజులను గుర్తు చేస్తోంది. ఐదేళ్ల కిందట రేషన్ సరుకులు కోసం డీలర్ ఇంటి వద్ద లేదా డిపో వద్ద గంటల తరబడి కాపలా కాసేవారు. రేషన్ సరుకులు కావాలంటే పేదలు ఆ రోజు పనులు మానుకొని, వాయిదా వేసుకుని మరీ సరుకులు తీసుకునేవారు. ఇప్పుడు మళ్లీ ఆ పరిస్థితులు పునరావృతం కానున్నాయి. ఇప్పటి వరకు వాహనాల ద్వారా సరుకులు అందించిన ఎండీయూ ఆపరేటర్లు, వారి సహాయకులు ఉపాధి కోల్పోనున్నారు.

అక్రమాలకు మార్గం..

పాత విధానం మళ్లీ అమలులోకి వస్తే అవినీతి తారస్థాయికి చేరుకుంటుంది. తూనికల్లో తేడాలు, కొంత మందికి సరుకులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం, రాత్రి పగలు డిపో వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. డీలర్లపై గతంలో ఆరోపణలు రావడంతో డిపోలను స్టాక్ పాయింట్‌గా మార్చి డీలర్ల శ్రమకు తగ్గ ఫలితాన్ని కమిషన్ రూపంలో అందజేశారు. రేషన్ వాహనాలను ఏర్పాటు చేసి పేదలకు సరుకులు అందించారు. ఇప్పుడు మళ్లీ పాత విధానం అమలుచేస్తే డీలర్లకు రెక్కలు వస్తాయి. జిల్లాలో రేషన్ కార్డులు 6,71,103లు ఉండగా, వీటిలో 19,71,698 యూనిట్లు ఉన్నాయి. వీటికి గాను జిల్లాలో 1603 రేషన్ డిపోలు ఉండగా, వీటిలో 1595లకు డీలర్లు ఉండగా, 8 డిపోలు స్వయం శక్తి సంఘాలు నడుపుతున్నాయి.

ఉపాధి గల్లంతు..

బియ్యం బళ్ల ద్వారా ఉపాధి పొందిన వారికి ఆ ఉపాధి ఇప్పుడు గల్లంతు కానుంది. ఇలాంటి వాహనాలు జిల్లాలో 422 ఉన్నాయి. ఆపరేటర్లలో ఎస్సీ 51, ఎస్టీలు 26, బీసీలు 333, ఓసీలు 11, మైనారిటీలు 01 ఉన్నారు. వీరికి తోడుగా సహాయకులు మరో 422 మంది ఉన్నారు. మొత్తం ఈ వాహనాల ద్వారా 844 మంది ఉపాధిని పొందుతున్నారు. వీరితో పాటుగా మరో 11 మంది టెక్నికల్ కంపెనీలకు చెందిన టెక్నికల్ సిబ్బంది ఉన్నారు. వీరంతా ఉపాధిని కోల్పోతారు.

కొండకు గుండెపోటు..

మైదాన ప్రాంతాల పరిస్థితి ఎలా ఉన్నా... కొండల్లో నివసిస్తున్న గిరిజన లబ్ధిదారులు మాత్రం ఇబ్బందులు పడక తప్పదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల తమకు సమస్యలు వస్తాయని పాతపట్నం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ బియ్యం కోసం రోజంతా...

కొండల్లో నివసిస్తున్న గిరిజనులు ప్రతి నెలా రేషన్ బియ్యం తీసుకునేందుకు కొండ దిగి కిందకు రావాల్సి ఉంటుంది. దీంతో ఆ రోజుకు కూలి పని మానుకోవాల్సి ఉంటుంది. ఆటోలకు అద్దెలు చెల్లించి కొండదిగి కిందకు వెళ్లాలి. రేషన్ సరుకులు ఇచ్చే డీలరు వద్దకు వచ్చే సరికి అప్పటికే అక్కడ ఎక్కువ మంది కార్డుదారులు ఉంటే రోజంతా వేచి ఉండాల్సిందే. బియ్యం కోసం నెలకోసారి ఇలా రోజంతా కాపలా కాయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.



జి.సిగడాం : 2014-2019 మధ్య కాలంలో ఉల్లివలస ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న రేషన్ లబ్ధిదారులు (ఫైల్)



పాతపట్నం: సవర సిద్దమనుగు నుంచి బొన్నికు కాలినడకన రేషన్ బియ్యం, సరుకులు పట్టుకుని వెళుతున్న గిరిజన మహిళ (ఫైల్)

మూడు కిలోమీటర్లు వెళ్లాల్సిందే



ఇంటికి ఎండీయూ వాహనం ద్వారా ప్రభుత్వం రేషన్ ఇవ్వకపోతే, ప్రతి నెల మా గ్రామస్తులు మూడు కిలోమీటర్లు వెళ్లి రేషన్ తీసుకుని, తిరిగిరావాలి. ఇంటికే రేషన్‌బండి వచ్చేది. మా గ్రామస్తులతో పాటు బీముడుపేట, మోరిలిపేట, కొనంగి, గిట్టంగి గిరిజన గ్రామాలు కూడా ఇబ్బందులు పడతారు.

– తంప ఆదినారాయణ, చీపురుగుడ్డి గ్రామం, పాతపట్నం మండలం

ఇబ్బందులు పడాల్సిందే



రేషన్ ఇంటికి ఇవ్వకపోతే మేము ఇబ్బందులు పడాల్సిందే. ప్రతి నెల రేషన్ డిపో వద్దకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంటుంది. రోజుల తరబడి కాపు కాయాల్సిందే. ప్రభుత్వం ఇంటికి బియ్యం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. – జన్ని చంద్రరావు, చిన్నకింగ గ్రామం, పాతపట్నం మండలం

ఒక రోజు ఊరు వెళ్లినట్లే ..



2014–2019 కాలంలో కోటా బియ్యం తీసుకోవాలంటే భయమేసేది. మేము నడవలేక ఆటో పెట్టుకోలేక నానా ఇబ్బందులు పడేవాళ్లం. మాకు ప్రభుత్వం ఇచ్చేది 5 కిలోల బియ్యం. ఆ బియ్యం తెచ్చుకోవాలంటే 12 కిలోమీటర్ల దూరం వెళ్లేవాళ్లం. జగనన్న ప్రభుత్వం హయాంలో మా ఇంటికి వచ్చి రేషన్ ఇచ్చేవారు. ఎలాంటి కష్టాలు లేకుండా ఆనందంగా రేషన్ తీసుకునేవాళ్లం. పాత పద్ధతి వస్తే నరక యాతన పడాల్సి వస్తుంది.

– మామిడి బలరాం, ఉల్లివలస, జి.సిగడాం మండలం

జిల్లాలో రేషన్ కార్డులు	యూనిట్లు	రేషన్ డిపోలు	డీలర్లు ఆధ్వర్యంలో డిపోలు	స్వయం శక్తి సంఘాల ఆధ్వర్యంలో డిపోలు	వాహనాలు	వాహనాల ద్వారా ఉపాధి పొందుతున్న వారు	టెక్నికల్ సిబ్బంది
6,71,103	19,71,698	1603	1595	8	422	844	11

ప్రజలు చనిపోతుంటే మీకు పట్టదా..!


- మెట్టవలసలో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- 24 గంటల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ఆదేశం



అధికారులపై అగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జి.సిగడాం: 'ప్రజలు చనిపోతుంటే కనిపించడం లేదా. ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోతే నేరుగా ఇంటికి వెళ్లిపొండి' అంటూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉద్యోగులను హెచ్చరించారు. ఆయన శుక్రవారం మెట్టవలస గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వారం రోజులుగా ఊరిని డయేరియా కుదిపేస్తున్నా ఇంకా అక్కడ పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో ఊరంతా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. లేకుంటే జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులను సస్పెండ్ చేస్తానన్నారు. డీఎంహెచ్‌ఓ మీనాక్షి, స్థానిక వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరావు సమన్వయంతో విధులు నిర్వహించి డయేరియాను అదుపులోకి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో ఒకే ఒక్క మంచినీటి బోరు ఉందని, మిగతా బోర్లలో ఉప్పునీరు వస్తోందని సర్పంచ్ కామొజుల సీతారాం, ఎంపీటీసీ సభ్యులు బెవర జగన్నాథం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ స్థానిక సిబ్బందిని ఆదేశించారు. డయేరియా అదుపులోకి వస్తుందని, ఎవరూ అధైర్యపడవద్దని గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. అవసరమైన చోట నిధులు కేటాయించి ప్రత్యేక వైద్యసేవలను మెట్టవలసలో ఏర్పాటు చేస్తామన్నారు. ఆయనతోపాటు జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ, డీఎల్‌పీఓ గోపిబాల, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ వెంకన్నబాబు, మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా రణస్థలం ఆదర్శ పాఠశాల



కొండములగాం ఆదర్శ పాఠశాల

రణస్థలం: ఎస్ఎస్‌సీ మార్చి 2024 ఫలితాల్లో రణస్థలం మండలంలోని కొండములగాం ఆదర్శ పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. 78వ స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ పాఠశాల అవార్డు అందుకోనున్నట్లు ఈ మేరకు ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వచ్చిందని చెప్పారు.

ఎల్ఎన్‌పేటకు పోలీస్ స్టేషన్



ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఎల్ఎన్ పేట మండలానికి పోలీస్ స్టేషన్ కేటాయించే ప్రతిపాదన ఉందని, ఈ మేరకు ప్రభుత్వానికి జిల్లా పోలీస్ శాఖ తరపున నివేదికలు కూడా పంపించామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు తెలిపారు. ఇప్పటివరకు సరుబుజ్జిలి, ఎల్ఎన్ పేట రెండు మండలాలకు కలిపి సరుబుజ్జిలి మండల పరిధిలోనే పోలీస్ స్టేషన్ ఉండేదని దీంతో ఎల్ఎన్ పేట మండలవాసులు పది కిలోమీటర్లు దాటి వేరే మండల పరిధిలో ఉండే స్టేషన్‌కు వెళ్లేవారని అన్నారు. ఒకే మండలం ఒకే పోలీస్ స్టేషన్ ప్రాతిపదికన ఎల్ఎన్ పేట మండలంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

టీడీపీ మూల్యం చెల్లించుకోక తప్పదు



నరసన్నపేటలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్



కాశీబుగ్గ : అంబేడ్కర్ విగ్రహం వద్ద మట్లాడుతున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్
- అంబేడ్కర్ స్మృతివనంపై దాడి హేయమంటూ జిల్లా వ్యాప్తంగా ఆందోళన

నరసన్నపేట: టీడీపీ శ్రేణులు గడిచిన రెండు నెలలుగా చేస్తున్న అరాచకాలు, దాడులు, హత్యలు తాజాగా అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి సంఘటనను ప్రజలు గమనిస్తున్నారని, టీడీపీ ఇంతకు ఇంత మూల్యం చెల్లించుకోక తప్పదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బెజవాడ నడిబొడ్డున అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద దాడికి నిరసనగా నరసన్నపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. ఇలాంటి పనికి మాలిన పని టీడీపీ వాళ్లు తప్ప ఇంకెవరూ చేయరని దుయ్యబట్టారు. సిగ్గు లేకుండా దొంగచాటున రాత్రి 11 సమయంలో విగ్రహంపై దాడి చేశారని తెలిపారు. వైఎస్ జగన్ ఆధ్వర్యంలో నిర్మితమైన దేశం గర్వించే విగ్రహంపై దాడి చేయడం సరికాదన్నారు. 'మీరు మిడిసి పడాల్సిన అవసరం లేదు. చెప్పినవి వేదాంతాలు. చేసేవి తప్పుడు పనులు' అంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు గణేష్ పాటు వైసీపీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, ముద్దాడ భైరాగి నాయుడు, కేసీహెచ్‌బీ గుప్త, సురంగి నర్సింగరావు, రాజాపు అప్పన్న, పాగోటి రాజారావు, యాబాజి రమేష్, ధర్మాన జగన్, కృష్ణారావు పాల్గొన్నారు.

నేడు కొవ్వొత్తుల ర్యాలీ

నరసన్నపేట: అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చమూకల దాడికి నిరసనగా శనివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు నిచ్చారు. శుక్రవారం సాయంత్రం మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

ఆలోచనే దారుణం

అంబేడ్కర్ అందరి వాడు. ఆయన విగ్రహాన్ని ధ్వంసం చేయాలనే ఆలోచన రావడమే దారుణం. అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన వైఎస్ జగన్ పేరును తొలగించే ప్రయత్నం చేయడం బాధాకరం. ఇది రాజ్యాంగంపై జరిగిన దాడి.

– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

దారుణ చర్య..



విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ స్మృతివనంలో శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం దారుణం. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే.

– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్

ఎందుకంత కక్ష



స్మృతి వనం వద్ద శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం అంటే అంబేడ్కర్‌ను అవమానపరిచినట్టే. అసలు ఆ విగ్రహంపై ఎందుకంత కక్ష. నిందితులను పట్టుకుని శిక్షించాలి. – నర్తు రామారావు, ఎమ్మెల్సీ

దురహంకారానికి నిదర్శనం

విజయవాడ నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై తెలుగుదేశం మూకలు చేసిన ఉన్మాదం వారి దురహంకారానికి నిదర్శనం. ఈ ఘటనతో దేశం మొత్తం నివ్వెరపోయింది.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్



నందిగాంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న పేరాడ తిలక్ తదితరులు

క్లుప్తంగా

'వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలి'



నిరసన తెలియజేస్తున్న వామపక్ష నేతలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): క్విట్ ఇండియాడే స్ఫూర్తితో కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో పాతబస్టాండ్ వద్ద గల ఓ షాపింగ్ మార్ట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్జీఓ హోమ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. రైతులకు నష్టం కలిగించే రీతిలో కేంద్రం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేసారు.

జిల్లాలో 10 డెంగీ, 27 మలేరియా కేసులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

జి.సిగడాం: జిల్లాలో డెంగీ, మలేరియాతో పాటు అతిసార వ్యాధులపై వైద్యాధికారులను అప్రమత్తం చేస్తున్నామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి వెల్లడించారు. ఆమె శుక్రవారం మెట్టవలసలో విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 27 మలేరియా కేసులు, 10 డెంగీ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. అతిసార వ్యాధులు, డెంగీ జ్వరాలు, మలేరియా జ్వరాలపై ఎప్పటికప్పుడు గ్రామస్థాయిలో పని చేస్తున్న ఏఎన్ఎంలు, ఎంఎల్ఏహెచ్పీల ద్వారా సమాచారం తీసుకుని సకాలంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

రెండో విడతలో 123 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) ఎస్ఎం పురం క్యాంపస్లో రెండో విడత కౌన్సెలింగ్లో 123 మందికి ప్రవేశాలు కల్పించారు. రెండో విడత కౌన్సెలింగ్ శ్రీకాకుళం క్యాంపస్కు సంబంధించి నూజివీడులో శుక్రవారం నిర్వహించారు. మొదటి విడత కౌన్సెలింగ్లో 172 సీట్లు ఖాళీలు ఉన్నాయి. కౌన్సెలింగ్లో 123 మంది హాజరై అందరూ ప్రవేశాలు పొందారు. జనరల్ కేటగిరీలో 49 సీట్లు మిగిలిపోయాయి. ఈ ప్రవేశాలకు త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. శ్రీకాకుళం క్యాంపస్లో 1100 సీట్లు ఉండగా, 1110 సీట్లకు మెరిట్ జాబితా ప్రకటించారు. పది సీట్లు అదనంగా కేటాయించారు. జనరల్లో 1035 సీట్లు కాగా, ప్రత్యేక కేటగిరి ఎన్ఎస్ఎస్, స్కౌట్, దివ్యాంగులు, స్పోర్ట్సు అండ్ గేమ్స్ వంటి ప్రత్యేక కేటగిరీల్లో 75 సీట్లు కేటాయించారు. వీరి ధ్రువీకరణ పత్రాలు పరిశీలనకు జారీ చేసిన సంస్థలు జన్యూనిటీ పరిశీలనకు పరిశీలనకు పంపించారు.

'ఆశ్రాతో వినియోగదారుల్లో చైతన్యం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ అవేర్నెస్ (ఆశ్రా) ద్వారా వినియోగదారుల్లో చైతన్యం కల్పించి వారికి చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ఖాన్ అన్నారు. ఆసరా ప్రతినిధులు కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ చాంబర్లో ఆయనను కలిసి సమ్మిట్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఆశ్రా ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను, సేవలను జేసీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆశ్రా జిల్లా అధ్యక్షులు గంజి ఆర్ ఎజ్రా, ఆశ్రా జిల్లా ఉపాధ్యక్షుడు గేదెల ఇందిరాప్రసాద్, ఆకుల కృష్ణ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ



గురుకుల పాఠశాలలో విచారణ చేస్తున్న సన్యాసినాయుడు

నందిగాం: స్థానిక గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న లిమ్మక అక్షిత ఆత్మహత్యపై శుక్రవారం న్యాయ విచారణ చేపట్టారు. జిల్లా న్యాయ సాధికారత సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు గురుకులాన్ని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీశారు. సిబ్బందిని, కుటుంబసభ్యులను ఒక్కొక్కరిగా విచారించారు. ఈ విచారణలో గురుకులాల జిల్లా సమన్వయకర్త బాలాజీనాయక్, ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ తదితరులు ఉన్నారు.

జీ(వి)తమింతేనా..?



తరగతి గదిలో కాంట్రాక్ట్ లెక్చరర్

- మూడు నెలలుగా జీతాల్లేక అల్లాడిపోతున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం, గెస్ట్ లెక్చరర్లు
- నిలిచిన జూనియర్ కాలేజీ కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్
- రెన్యువల్ కూడా రాకపోవడంతో జీతాల కోసం ఎదురుచూపులు

శ్రీకాకుళం న్యూకాలనీ/నందిగాం: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు జీతం, జీవితం కోసం ఎదురు చూస్తున్నారు. వీరికి నాలుగు నెలలుగా జీతాలు చెల్లించలేదు. దీనికి తోడు రెగ్యులరైజేషన్, రెన్యువల్ ప్రక్రియలను కూడా కొత్త ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లడం లేదు. దీంతో వారంతా నిరాశలో కూరుకుపోయారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 370 మంది కాంట్రాక్టు లెక్చరర్లు, 25 పార్ట్‌టైం లెక్చరర్లు, 95 మంది గెస్ట్ లెక్చరర్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్నారు. ఏప్రిల్ 30తో సీఎల్స్ కాంట్రాక్టు ముగిసినా వారి సేవలు మాత్రం వేసవిలో సైతం నిరంతరాయంగా కొనసాగించారు.

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో 12 నెలలకు వీరికి జీతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మే, జూన్, జూలై నెలలకు సంబంధించి జీతాలు విడుదల కావాల్సి ఉంది. నాలుగో నెల గడుస్తున్నా ఇప్పటి వరకు రెన్యువల్ ఉత్తర్వులు విడుదల కాకపోవడంతో వారంతా అనేక పాట్లు పడుతున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీకి పీరియడ్కు రూ.150 చొప్పున గరిష్టంగా రూ.10వేల జీతంతో పదేళ్ల నుంచి పనిచేస్తూ వెట్టి చాకిరీ చేస్తున్నారు. తమను కాంట్రాక్ట్ లేదా పార్ట్ టైం వ్యవస్థలో విలీనం చేయాలని అప్పట్లో ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చారు. అది జరిగే వరకు కనీసం మానవతా దృక్పథంతో ఆలోచించి తమకు రూ.37వేల జీతం 11 నెలల పాటు ఇవ్వాలన్న వినతికి గత ప్రభుత్వ పెద్దలు సానుకూలంగా స్పందించినట్లు ఆ సంఘ రాష్ట్ర నాయకులు డాక్టర్ శరత్ బాబు, చల్లా జగ్గారావు, బద్ద గణేష్ తెలిపారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎంతో మేలు..

వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీతాలను రూ.27వేల నుంచి రూ.37,100లకు పెంచడమే కాకుండా 12 నెలల కాలానికి జీతాలు అమలయ్యేలా చర్యలు తీసుకున్నారు. డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు పీఆర్సీని వర్తింపజేస్తూ రూ.20వేలు పెంచి అమాంతం రూ.57,100లకు జీతాన్ని ఫిక్స్ చేసి ఆపద్బాంధవుడిలా నిలిచారు. అయితే 2024లో మళ్లీ వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కుంటి సాకులతో మేనెల జీతానికి ఎసరు పెట్టే దిశగా అడుగులు వేస్తోంది. అది తెలుసుకున్న కాంట్రాక్టు లెక్చరర్లు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

రెగ్యులరైజేషన్ ఉన్నట్టా..? లేనట్టా..?

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న, 2014 జూన్ 2వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీసు కలిగిన 10,117 మందిని గుర్తించి క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు. అయితే మళ్లీ కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి వచ్చిన అనేక విజ్ఞప్తుల నేపథ్యంలో 2014 జూన్ 2 నాటికి సర్వీసులో ఉన్నవారందరినీ రెగ్యులర్ చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు ఏపీ చట్టసభల్లో నూతనంగా 30 యాక్టుకు రూపొందించి, అందుకు అనుగుణంగా జీఓ నంబర్ 114ను జారీ చేశారు. అయితే వివిధ కారణాలతో జాప్యం జరిగి ఎన్నికల కోడ్ ముంగిట రెగ్యులరైజేషన్ ప్రక్రియ ఆఖరి దశలో నిలిచిపోయింది. దీంతో మిగిలిన ప్రక్రియను కొత్త ప్రభుత్వం పూర్తి చేయాలని అధ్యాపకులు కోరుతున్నారు.

రెగ్యులర్ చేయాలి



రాష్ట్రంలో మాతోపాటు ఇప్పటికే పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగులంతా ఏప్రిల్ 1 నుంచి రెగ్యులర్ అయ్యారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన రెగ్యులరైజేషన్ ప్రక్రియను కూటమి ప్రభుత్వం వెంటనే మొదలుపెట్టాలి. ఎలాంటి అడ్డంకులు లేకుండా కాంట్రాక్టు లెక్చరర్లు అందరినీ పర్మినెంట్ చేయాలి. అప్పటి వరకు ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా 12 జీతంతో కూడిన రెన్యువల్ను వెంటనే ప్రకటించాలి.

– సుంకరి దొరబాబు, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘ జేఏసీ నాయకులు

ఇబ్బందులు పడుతున్నాం..



మాకు మే నెల నుంచి జీతాలు లేవు. ప్రభుత్వం నుంచి రెన్యువల్ ఉత్తర్వులు రాకపోవడంతో బిల్లులు పెట్టడానికి, జీతాల చెల్లింపుకు అవకాశం లేదు. దీంతో మూడు నెలల నుంచి నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పెద్దలు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రాష్ట్రంలో పనిచేస్తున్న సీజేఎల్స్కు 12 నెలలతో కూడిన రెన్యువల్ను విడుదల చేయాలని విన్నవిస్తున్నాం.

– సనపల షణ్ముఖరావు, కెమిస్ట్రీ సీనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్

ఉత్తర్వులు వచ్చిన వెంటనే జీతాలు



ప్రభుత్వ నుంచి జీఎల్స్ రెన్యువల్స్ ఉత్తర్వులు రాకుండా జీతాల బిల్లుల చెల్లింపు జరగడానికి వీలు కాదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాల చెల్లింపులు జరుగుతాయి. అయితే కాంట్రాక్ట్ లెక్చరర్ల తమ కాలేజీల్లో పనిచేసుకోవడానికి ఎలాంటి ఆటంకం, ఇబ్బంది లేదు. వారం రోజుల్లో రెన్యువల్స్ ఉత్తర్వులు వెలువడవచ్చు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే జీతాల బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శివ్వాల తవిటినాయుడు, ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ, శ్రీకాకుళం జిల్లా

'గిరి' సంప్రదాయాలు రక్షించుకుందాం



గిరిజన విద్యార్థినులతో ఐటీడీఏ పీఓ రాహుల్ కుమార్‌రెడ్డి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ఘనంగా ఆదివాసీ దినోత్సవం



హిరమండలం సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

హిరమండలం: గిరిజన తెగల సంస్కృతి, సంప్రదాయాలు, భాష, లిపి రక్షించుకుందామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. హిరమండలం మండలం సుభలయలోని కమ్యూనిటీ భవన ఆవరణంలో ఐటీడీఏ పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా జీసీసీ, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, ఐసీడీఎస్, గిరి వెలుగు వైద్యారోగ్యశాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అధికారులు, ప్రజా ప్రతినిధులు సందర్శించారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పలు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు థింసా నృత్యం, సవర డ్యాన్స్ వంటివి నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ఉపాధి కల్పించాలని కోరారు. గిరిజనుల అటవీ ఉత్పత్తులను దళారుల బారి నుంచి కాపాడాలని ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీఓ బి.సుదర్శన దొర, తహసీల్దార్ బి.వెంకటరావు, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, ఎంఈఓ రాంబాబు, ఎన్ఆర్జీఎస్ ఏపీడీ రాధ, ఏఓ సంధ్య, ఐసీడీఎస్ పీఓ విమలాకుమారి, వైస్ ఎంపీపీ సవర వైకుంఠరావు, స్థానిక సర్పంచ్ ఎల్.రోజారాణి, జెడ్పీటీసీ సభ్యులు పొగిరి బుచ్చిబాబు, ఎంపీటీసీ సభ్యులు చింతాడ బుడ్డు సీఏపీఎస్ సంఘం అధ్యక్షురాలు పడాల భూదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు రూ.14.32 కోట్ల నిధులు : కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యాన పంటలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా అధిక మొత్తంలో నిధుల విడుదల చేసిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆయన శుక్రవారం జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్‌వీవీ ప్రసాద్‌తో కలిసి మాట్లాడుతూ గడిచిన 2021–2023 సంవత్సరాల మధ్య శ్రీకాకుళం జిల్లాలో ఉద్యానవన శాఖకు నిర్దేశించిన భౌతిక లక్ష్యాలకు అనుగుణంగా రైతులకు చెల్లించాల్సిన ఆర్థిక సహాయాన్ని వారి బ్యాంకు ఖాతాలకి జమ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 814 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ఎరువు నిమిత్తం వారి బ్యాంకు అకౌంట్లకు పీఎఫ్ఎంఎస్ ద్వారా జమ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు రూ.28.33 లక్షలు జమైందని, అలాగే సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం కింద మామిడి, జీడిమామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, ప్లాస్టిక్ మల్చింగ్, కోకో, సంకరజాతి కూరగాయల పెంపకం సాగు చేసే రైతులకు రూ.86.87 లక్షలు సబ్సిడీ మొత్తం అందజేసేందుకు నిధులు విడుదల చేశామని కలెక్టర్ తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు రూ.73.03 లక్షలు రైతుల ఖాతాలకు పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా జమ చేసినట్లు చెప్పారు.

అలాగే రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా జిల్లాలో నెలకొల్పిన వివిధ ఉద్యాన పంటల సేకరణ కేంద్రం నిర్మాణానికి ఒక్కో సెంటరుకు రూ.11.25 లక్షల చొప్పున జిల్లా వ్యాప్తంగా 29 కలెక్షన్ సెంటర్లకు రూ.200.25 లక్షలు, గతంలో రైతు సంఘాలకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పుడు మరో విడతలో రైతు సంఘాలకు రూ.95 లక్షలు ఇచ్చామని, అలాగే శీతల గదుల నిర్మాణాల కోసం ఒక్కో నిర్మాణానికి రూ.9.37 లక్షల చొప్పున 9 నిర్మాణాలకు ఇదివరకే రూ.59.37 లక్షలు సంఘాలకు ఇచ్చి, తాజాగా మరో విడతలో రూ. 25 లక్షలు విడుదల చేశామన్నారు.

పదే పదే అదే తప్పు



విద్యార్థుల మరుగుదొడ్డికి ఆనుకొని ఉన్న షెడ్‌లో మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలం లొద్దపుట్టి ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్డి వద్దనే మధ్యాహ్న భోజనం వంట అంటూ శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన 'కిటికీలు లేవంట' కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే వంట నిర్వహణను వేరే ప్రదేశానికి మార్చాలంటూ డిప్యూటీ డీఈఓ పి.విలియమ్స్, ఎంఈఓ కురమాన అప్పారావులు ఆదేశించారు. కానీ పాఠశాల సిబ్బంది మాత్రం స్పందించలేదు. శుక్రవారం కూడా బాలబాలికలు వినియోగించే మరుగుదొడ్డి వద్దనే వంట చేయడం విశేషం. ఈ విషయమై స్థానిక ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి వద్ద ప్రస్తావించగా సోమవారం నాటికి నూతనంగా నిర్మించిన వంట గదిలోకి మార్చుతామని అన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి ఆత్మహత్య

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఎల్సీ గేటు దిగువన మురళీధర్ పాత్రో (64) అనే వ్యక్తి బస్సు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇక్కడ రైలు గేటు వేయడంతో బస్సులన్నీ ఆగి ఉన్నాయి. గేటు ఎత్తాక అన్ని బస్సులు కదిలాయి. సరిగ్గా అదే సమయంలో శ్రీకాకుళం నుంచి పలాస వస్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు వెనుక టైర్ల కింద ఆయన తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీయగా కాశీబుగ్గకు చెందిన మురళీధర్ పాత్రో (64)గా గుర్తించారు. కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కల్లేపల్లి నుంచి కిల్లిపాలెం మీదుగా విశాఖపట్నంకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీను గ్రామ రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. సేఫ్‌సైడ్ కస్టోడియన్ నిమిత్తం లారీను సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో రెవెన్యూ అధికారులు తవుడు, అప్పారావు, శాంతారావు, జయకృష్ణ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : స్థానిక ఆదివారం పేట సమీప బుచ్చిపేట వద్ద ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ దేవదానం తెలిపిన వివరాల మేరకు గురువారం రాత్రి ఆదివారం పేటకు చెందిన మామిడి హేమంతరావు నడుచుకుంటూ వస్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో ఎడమ కాలి మడమకు ఫ్రాక్చరైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

100 మొబైల్ ఫోన్ల రికవరీ



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, స్వాధీనపర్చుకున్న మొబైల్ ఫోన్లు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో రూ.15 లక్షలు విలువ చేసే వంద మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. గత 45 రోజుల్లో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారిని జిల్లా ఎస్పీ కార్యాలయానికి పిలిపించి శుక్రవారం ఎస్పీ మహేశ్వర రెడ్డి వారికి ఫోన్లను అందజేశారు. ఎవరైనా ఫోను పోగొట్టుకుంటే తక్షణమే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ది టెలికమ్యూనికేషన్ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సిఇఐఆర్) పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే తిరిగి పొందే వీలుందని ఎస్పీ తెలిపారు.

జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు రూ. 79 లక్షలు విలువ చేసే 618 మొబైళ్లను లాస్ట్‌మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్, సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదులు చేసిన బాధితులకు రికవరీ చేసి అందించినట్లు పేర్కొన్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి పొందేందుకు సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేసిన తక్షణమే జిల్లా సైబర్ సెల్ కు ఫిర్యాదు చేరుతుందని, ఈలోగా బాధితుడు దగ్గరలో ఉన్న పీఎస్‌కు వెళ్లి కచ్చితంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనంతరం సైబర్ సెల్‌లో ఉండే నిపుణుల బృందం సీఐ టి.శ్రీను పర్యవేక్షణలోని



మొబైల్ ఫోన్‌ను అందజేస్తున్న దృశ్యం

సిబ్బంది పైలా శరత్‌చంద్ర (చక్రి), శేషగిరి, సుధీర్, సత్యనారాయణ, పద్మజ్యోతి, కుసుమ తమ నైపుణ్యంతో ట్రాక్ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, సైబర్ సెల్ సీఐ శ్రీను, సిబ్బంది, సీసీ శివకుమార్, పీఆర్వో భాస్కర్ ఉన్నారు.

విప్రో ఉమెన్ స్కాలర్‌షిప్‌కు 92 మంది ఎంపిక



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్ర, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల విద్యార్థులు సరికొత్త చరిత్ర లిఖించారు. విప్రో కెరీర్, విప్రో ఫౌండేషన్ వారు 2023–24 విద్యా సంవత్సరానిగాను ప్రకటించిన 'సంతూర్ ఉమెన్స్ స్కాలర్‌షిప్' అవార్డుకు ఆ కళాశాల నుంచి రికార్డు స్థాయిలో 92 మంది ఎంపిక కావడం గమనార్హం. జిల్లాలో ఒక విద్యాసంస్థ నుంచి ప్రభుత్వ/ప్రైవేటు స్కాలర్‌షిప్‌కు ఇంతమంది ఒకేసారి ఎంపిక కావడం ఇదే మొదటిసారని అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎంపికైన వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.2000 లెక్కన ఏడాదికి రూ.24వేలు చొప్పున మూడేళ్లకు కలిపి రూ.72,000ల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమచేయనున్నారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాలలో శుక్రవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ కళాశాల నుంచి 92 మంది సంతూరు ఉమెన్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమని ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్ర కొనియాడారు.

ఓనిగెడ్డ నీరు విడుదల

బూర్జ: ఓని గెడ్డ నీరు ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం విడుదల చేశారు. మండలంలో గల డొంకలపర్త పంచాయతీలో హరిపురం, పల్లాపురం నుంచి మండలానికి సాగునీరు అందించే ప్రధాన కాలువ ద్వారా పాలకొండ మండలం వెలగవాడ గ్రామ దగ్గర ఓని గెడ్డ ప్రధాన కాలువ ద్వారా నీరు విడుదల చేయడంతో పలువురు నాయకులు, ఆయకట్టు దారులు హర్షం వ్యక్తం చేశారు.

భార్య కళ్లెదుటే భర్త మృతి



రోడ్డు ప్రమాదం



బుచ్చిబాబు (ఫైల్)

సారవకోట: మండలంలోని నౌతళ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట మండలం జమ్ము పంచాయతీ పొన్నానపేటకు చెందిన పొన్నాన బుచ్చిబాబు(40) మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పొన్నానపేటకు చెందిన పొన్నాన బుచ్చిబాబు భార్య మీనమ్మతో కలిసి పాతపట్నం మండలం రుగడ గ్రామానికి శుభకార్యానికి హాజరయ్యా రు. శుభకార్యం ముగించుకుని తిరిగి పొన్నానపేట వెళ్తుండగా జాతీయ రహదారి 326ఎ పై నౌతళ సమీపంలో శ్రీకాకుళం నుంచి పాతపట్నం వైపు వెళ్తున్న కారు అతి వేగంగా ఆటోను అధిగమించబోయి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో బుచ్చిబాబు అక్కడికక్కడే మృతి చెందగా భార్య మీనమ్మ తీవ్ర గాయాలపాలయ్యారు. ఈమెను తొలుత పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం తరలించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేశారు. ప్రమాదంలో కారు, ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయ్యాయి.

మృతుని బంధువుల నిరసన

రోడ్డు ప్రమాదం తర్వాత బుచ్చిబాబు బంధువులు, గ్రామస్తులు నౌతళ సమీపంలో జాతీయ రహదారి 326ఎ పై ద్విచక్ర వాహనాలు రోడ్డుకు అడ్డంగా పెట్టి నిరసన తెలియజేశారు. ప్రమాద సమయంలో కారును డ్రైవ్ చేస్తున్నది ఓ డాక్టర్ అని, ఆమె నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లనే బుచ్చిబాబు మృతి చెందాడని వారు ఆరోపించారు. కానీ ఆమెను రక్షించి వేరే వాళ్లని డ్రైవర్‌గా చూపించేందుకు చూస్తున్నారని తెలిపారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు వారితో సంప్రదించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. బుచ్చిబాబు మృతితో పొన్నానపేటలో విషాదం అలముకుంది. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సెపక్‌తక్ర జాతీయ జట్టు ఎంపికలకు దుర్గాప్రశాంతి



దుర్గాప్రశాంతిని అభినందిస్తున్న ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, పక్కనే అర్జున్‌రెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆరో ఏషియన్ ఇండోర్, మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలకు గాను సెపెక్‌తక్ర గేమ్‌లో పాల్గొనే భారత మహిళల జట్టు ఎంపికల కోసం శ్రీకాకుళం జిల్లాకు చెందిన గేదెల దుర్గాప్రశాంతికి పిలుపువచ్చింది. దీంతో దుర్గాప్రశాంతిని జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తన నివాసంలో అభినందించారు. భారత జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

ఏఐసీఏ బోర్డు మెంబర్‌గా కాంతారావు



మల్లా కాంతారావు

కాశీబుగ్గ: ఆల్ ఇండియా కాష్యూ అసోషియేషన్ ఫౌండేషన్ (ఏఐసీఏ) బోర్డు మెంబర్‌గా పలాస పారిశ్రామిక వాడకు చెందిన జీడి వ్యాపారి మల్లా కాంతారావుకు అరుదైన అవకాశం లభించింది. బెంగళూరులో 8, 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా కాష్యూ అసోసియేషన్ ఇనాగరేషన్‌లో పది రాష్ట్రాలు పాల్గొనగా బోర్డులో ఆయనకు చోటు దక్కింది. దీంతో పలాసలో జీడి వ్యాపారులు ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు.